# ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలను అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

**మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



వివరాలు 5లో

నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం | 24 మార్చి 2025 | పేజీలు 8

### రామతీర్థం బీచ్ పర్యాటక

## అభివృద్ధికి శ్రీకారం



**విడవలూరు, మేజర్‌న్యూస్ :**

కోవూరు నియోజకవర్గంలోని రామతీర్థం, మైపాడు బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలంలోని రామతీర్థంలో తరంగ్ రిసార్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. గతంలో ఏపీ టూరిజం ఆధ్వ ర్యంలో నిర్మించిన రిసార్ట్ "తరంగ్ రిసార్ట్స్" పేరిట పునః ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రిసార్ట్ నిర్వాహకులైన ఈవెంట్స్ వెంకటేశ్వర రావును ఈ సందర్భంగా అభినందించారు. వీకెండ్స్ సందర్భంగా బీచ్ సందర్శించే పర్యాటకులకు "తరంగ్ రిసార్ట్స్" ప్రయోజనకరంగా ఉంటుం దన్నారు. రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులతో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న రామతీర్థం గ్రామం తరంగ్ రిసార్ట్స్ నిర్మాణంతో పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రిసార్ట్ యాజమాన్యాన్ని కోరారు. రిసార్ట్ నిర్వాహకులకు సహాయ సహకారాలు అందించి రామతీర్థం పర్యాటక అభివృద్ధిలో భాగస్వాముల కావాలని ఆమె స్థానికులకు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, మండల అధ్యక్షులు చెముకుల శ్రీనివాసులు, యువ నాయకులు బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, సత్యంరెడ్డి ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు.







### గొప్ప సేవాతత్పరుడు

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మకూరులో పండగ
- వాతావరణంలో దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు పంపిణీ
- వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 150 ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన ఎంపీ, మంత్రి, ఎమ్మెల్సీ
- ఇది గొప్ప మధురానుభూతి.. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

విశాలమైన మనసు గల గొప్ప సేవాతత్పరుడు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కొని యాడారు. 150 మంది దివ్యాంగులకు వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్స్ అందించడం ఆత్మకూరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారా యణ రెడ్డి సారథ్యంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో దివ్యాం గులకు ట్రై సైకిళ్ల పంపిణీని పండగ వాతావరణంలో నిర్వహించారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రూ.60 లక్షలు విలువ చేసే 150 ఎలక్ట్రిక్ మోటార్ ట్రై సైకిళ్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పంపిణీ చేశారు. దివ్యాంగుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ.. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ట్రై సైకిళ్లు అందజేశారు. రూ.40 వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ను ఉచితంగా అందజేయడం పట్ల తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ.. -మిగతా 4లో

### వైసీపీ ప్రభుత్వంలో..

## అభివృద్ధి.. సంక్షేమ పథకాలు అందించాం

**రాష్ట మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి**

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :**



వైసీపీ ప్రభుత్వంలోనే ముస్లిం కుటుంబాలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టా మని రాష్ట్ర మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణిగోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేం ద్రం పెద్ద మసీదులో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మాజీ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి మసీదులో ప్రార్థన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేస్తున్న సందర్భంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధిపై దృష్టి పెట్టి అభివృద్ధి పనులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీలను అన్ని విధాల అగ్రగామిగా -మిగతా 2లో

- ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి
- భూగర్భ డ్రైనేజీకి కేవలం ఒక రూపాయి చెల్లిస్తేచాలు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తా
- మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం
- నెల్లూరు నగర పర్యటనలో మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

### ప్రజల భాగస్వామ్యంతోనే..

## అభివృద్ధి సాధ్యం



**నెల్లూరు కార్పొరేషన్/కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని, భూగర్భ డ్రైనేజీ అందుబాటులో ఉన్న పట్టణాల్లో కనెక్షన్‌ను కేవలం ఒక రూపాయికే అందించనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము నుండి -మిగతా 2లో

# ప్రజా ఉద్యమంతోనే వెలుగొండ జలాలు సాధ్యం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో మెట్ట ప్రాంతాల ప్రజలు ఉద్యమిస్తేనే వెలుగొండ జలాశయం పూర్తయి సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయని వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక షాదీమంజిల్ ఆవరణలో వెలుగొండ ప్రాజెక్టు జలాల సాధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెలుగొండ జలాశయం పూర్తయితే ఆయా జిల్లాల్లో 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, 25 లక్షల మంది ప్రజల తాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టును ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా వెలుగొండ జలాశయం పనుల్లో పురోగతి కనిపించడంలేదు. 29 ఏళ్ల క్రితం ప్రారంభమైన ప్రాజెక్టు పనులు ఇంకా కొనసాగుతుండడం మెట్ట ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో తేటతెల్లమవుతోందన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమేనా మిగిలిన ప్రాంతాల అభివృద్ధి పట్టదా అంటూ ఎద్దేవా చేశారు. ఏడాదికి రూ.2 వేల కోట్లు కేటాయించి మూడేళ్లల్లో వెలుగొండ జలాశయాన్ని పూర్తి చేయాలని పాలకులు, అధికారులను కోరినా బడ్జెట్లో కేవలం రూ.309 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. రూ.2 వేల కోట్లు కేటాయించని ప్రభుత్వం రూ.80వేల కోట్లు పెట్టి గోదావరి జలాలు తీసుకొస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వెలుగొండతోపాటు అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి, సీతారాం సాగర్ ప్రాజెక్టులు పూర్తయి మెట్ట గ్రామాల చెరువులకు నీరు నింపితే బీడు భూములు సాగులోకి వచ్చి వలసలు నివారించడంతోపాటు ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతోందన్నారు. వెలుగొండ జలాశయం పూర్తి చేసేందుకు పార్టీలకతీతంగా రాజకీయ నాయకులతోపాటు మేధావులు, రైతులు, యువత, ఉద్యోగులు, ప్రజలు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెలుగొండ జలాశయాన్ని పూర్తి చేసి మెట్ట ప్రాంతాల్లో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసీరెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథ రామిరెడ్డి, సీపీఐ, సీపీఎం, సాధన సమితి నాయకులు ప్రభాకర్, మూలం రమేష్ దామా అంకయ్య, అజయ్కుమార్, బసిరెడ్డి మాలకొండారెడ్డి, దస్తగిరి అహ్మద్, ఫర్ష్ రమణయ్య ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సాయిబాబా సత్సంగ మహోత్సవం

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో తూర్పు వీధిలో ఉన్న సాయిబాబా మందిరంలో ఆదివారం సాయిబాబా సత్సంగ మహోత్సవం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరంలో ప్రత్యేకంగా పూల అలంకరణ చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం, అన్న ప్రసాదం వినియోగం నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుండి సాయిబాబా నామ సంకీర్తనలతో భజన కార్యక్రమంతో పాటు గ్రామంలోని నగర ఖాన మీదుగా బస్టాండు సెంటర్ సత్రం సెంటర్ మెయిన్ బజార్ మీదుగా సాయిబాబా మందిరం వరకు సాయిబాబా పల్లకి గ్రామోత్సవం నిర్వహించారు రాత్రి సాయి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజలు, సాయిబాబా భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని సత్సంగ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం





*(మొదటి పేజీ తరువాయి)*

మంత్రి నారాయణ నగరంలోని ఎన్‌టిఆర్ నగర్‌లోని మూడు జెండాల పార్క్, ఈఎస్ఎల్ఆర్ పార్క్, రాయపుపాలెం ప్రాథమిక పాఠశాల, వేపదొరువు పార్క్, మల్లెల సంజీవయ్య మెమోరియల్ ఉన్నత పాఠశాల ఏసీ నగర్‌లోని మాగుంట సుబ్బరామిరెడ్డి పార్క్, బాజీతోట, ఏసీ నగర్‌లలోని ప్రాథమిక పాఠశాలలు, ఆదిత్య నగర్‌లోని ఎస్పీ బాలసుబ్రమణ్యం పార్క్, జగదీష్ నగర్ పార్క్, నుడా పార్క్ తదితర పార్కుల్లో ఏర్పాటు చేస్తున్న జిమ్ ఎక్విప్మెంట్, వాకింగ్ ట్రాక్ తదితర పనుల పురోగతిని మంత్రి స్వయంగా పరిశీలించారు. ఆటస్థలాలు అనువుగా ఉన్న పాఠశాలల్లో బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గతంలో తాము అధికారంలో ఉన్న 2014-19లో రాష్ట్రంలోని 110 మున్సిపాలిటీల్లో పార్కులను, సెంట్రల్ లైటింగ్ సిస్టంను అభివృద్ధి చేశామన్నారు. అయితే తర్వాత వచ్చిన ప్రభుత్వ నిర్వహణ లోపాలతో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ్ ఆంధ్ర పేరుతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంను నిర్వహిస్తున్నామని, పరిశుభ్రతపై ప్రజలందరికీ అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా నెల్లూరు నగర అభివృద్ధి ధ్యేయంగా అన్ని పార్కుల్లో జిమ్ ఎక్విప్మెంట్, అనువైన చోట వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు వారి అవసరాలు వారి ద్వారానే నేరుగా తెలుసుకొని అందుకు అనుగుణంగా పార్కులను, పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. అదేవిధంగా భూగర్భ డ్రైనేజీ కనెక్షన్ ఏర్పాటుకు గతంలో 5 వేలుగా ఫీజు వసూలు చేసేవారని, ప్రస్తుత ప్రభుత్వం కేవలం ఒక రూపాయికే కనెక్షన్‌ను అందిస్తున్నామన్నారు. అయితే వారి ఇంటిలోని పైప్‌లైన్ ఖర్చు వారే భరించాల్సి ఉంటుందన్నారు. దోమలు లేని నగరంగా తీర్చిదిద్దాలంటే భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుతోనే సాధ్యమన్నారు. గ్రీన్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తమది చేతల ప్రభుత్వమని, చెప్పిన ప్రతి పనిని ఆచరణలో చేసి చూపిస్తామన్నారు. రాబోయే జూన్ మాసం బడులు ప్రారంభించే నాటికి అన్నింటిలో ఆట వస్తువులు, జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అభివృద్ధి అంటే నారాయణ, నారాయణ అంటే అభివృద్ధి అని, అభివృద్ధి ప్రదాత నారాయణ అని జనం జేజేలు పలకడం విశేషం. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, టిడిపి నగర ఇంచార్జ్ మామిడాల మధు, ఇతర అధికారులు, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి.. సంక్షేమ పథకాలు అందించాం

*(మొదటి పేజీ తరువాయి)*

నిలబెట్టేందుకు కృషి చేసిన నాయకుడు వైయస్ జగన్ అని మాజీ మంత్రి అన్నారు. ముత్తుకూరు మండల కేంద్రంలో నివసిస్తున్న అనేక ముస్లిం కుటుంబాలకు గతంలో స్మశానవాటిక కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో తాను మంత్రిగా పనిచేస్తున్నప్పుడు ముస్లిం స్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మించి అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తు చేశారు. ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో ఎటువైపు వెళ్లాలన్న ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న సందర్భంలో ముత్తుకూరు జంక్షన్ వెడల్పు చేయించి, అన్నివైపులా సిమెంటు రోడ్లు నిర్మించామని మాజీ మంత్రి అన్నారు. ముత్తుకూరు మండల కేంద్రంలో సిమెంటు రోడ్లు, సైడ్ డ్రైన్లు తదితర మౌలిక వసతుల కోసం 50 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు మాజీ మంత్రి చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం పట్ల అధికారంలో ఉన్నా, లేకపోయినా, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా నిలుస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. అల్లాహ్ దీవెనలు ప్రజలకు పుష్కలంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు మాజీ మంత్రి తెలిపారు. ముస్లిం కుటుంబాలకు పేరుపేరున ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవత పెద్దగూడెంకు పొంగళ్ళు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బ్రహ్మదేవి గ్రామ పంచాయతీలో గ్రామదేవత పెద్దగూడెమ్మకు ఆదివారం గ్రామస్తులు పొంగళ్ళు పొంగించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ దపాకూడా ఈ కార్యక్రమాన్ని ఘనంగా చేశారు. గ్రామ దేవత తో పాటు పోతు రాజు స్వామి వారికి కార్యక్రమాన్ని జరిపారు. అంతకుముందు రెండు రోజులపాటు గ్రామస్తులు గ్రామదేవతలైన పోలేరమ్మ, కనకదుర్గమ్మ, మహాలక్ష్మమ్మ, అంకమ్మ, దిబ్బాలమ్మలకు రోజు వారి కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు ప్రత్యేక పుష్పాలంకరణతో గ్రామ దేవతలను అలంకరించారు. అదేవిధంగా దేవత మూర్తులవి గ్రహాలను గ్రామంలో ఊరేగించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలుమధ్య భక్తి శ్రద్ధలు ఆచరిస్తూ మొక్కులు తీసుకున్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ జరిగింది. గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అచ్చమాంబ పొంగళ్ళు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని పొంగూరు మాలిచేలో వెలసిన అచ్చమాంబ ఆలయం వద్ద ఆదివారం భక్తులు ఘనంగా పొంగళ్ళు పొంగించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసాలు ఉండి పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నెలకొన్న ఈ ఆలయం వద్దకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

## వయోజనులకు ఉల్లాస్ పరీక్షలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలో ఆదివారం వయోజనులకు ఉల్లాస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఏపీఎం ఖాజా రహంతుల్లా తెలిపారు. మండలంలో 18 కేంద్రాల్లో ఈపరీక్షను నిర్వహించగా 331మంది వయోజనులకు గాను 329 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈపరీక్షలను వయోజన విద్య పర్యవేక్షకులు షేక్. బాదుల్లా పర్యవేక్షించారు. నిరక్షరాస్య వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఈపరీక్షలు నిర్వహిస్తుందన్నారు.

# కావలికి చేరిన సీఐఎస్ఎఫ్ కోస్టల్ సైక్లోథాన్





**కావలి, మేజర్ న్యూస్ :** కావలి నెల్లూరు జిల్లా నుండి 1800 గంటలకు కావలి నెల్లూరు జిల్లాకి చేరుకుంది మరియు సైక్లిస్టులకు స్థానిక ప్రముఖులు, పాఠశాల పిల్లలు, స్థానిక ప్రజలు పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. సైక్లోథాన్ ఇప్పటికే బక్కలి పశ్చిమ బెంగాల్ నుండి కావలిఆంధ్రప్రదేశ్ వరకు 1880 కిలోమీటర్ల సవాలుతో కూడిన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు, ఇది ఇప్పటివరకు భారతదేశ విస్తారమైన తీరప్రాంతాన్ని కవర్ చేసిన అద్భుతమైన యాత్ర. ఈ కార్యక్రమానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కావలి పోలీస్ స్టేషన్ ఆఫీసర్, సంజీత్ సీనియర్ కమాండెంట్, సి. ఐ.ఎస్.ఎఫ్ యూనిట్ఎస్ డీఎస్పీ-షార్, శ్రీహరికోట, విక్రమ్ సింగ్ అసిస్టెంట్ కమాండెంట్, సీఐ ఎస్.ఎఫ్.యూనిట్ ఎస్.డి.ఎస్.సి, షార్ – శ్రీహరికోట నిర్వహణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ యూనిట్ ఎ.స్టీ.పీ.పీ. సింహాద్రి డిప్యూటీ కమాండెంట్ వినీత్ కుమార్ ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. దేశ నిర్మాణంలో సి.ఐ.ఎస్.ఎఫ్. అందిస్తున్న సేవలు మరియు కీలక పాత్రకు సభాసదులు అభినందనలు తెలిపారు. జాతీయ భద్రత మరియు సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో సైక్లోథాన్ యొక్క ప్రాముఖ్యతను వారి ఉనికి హైలైట్ చేసింది. సాయంత్రం ప్రముఖులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ గొప్ప కార్యక్రమానికి నాయకత్వం వహించినందుకు సిఐఎస్ఎఫ్‌ను ప్రశంసించారు. పౌరులలో తీరప్రాంత భద్రతా అవగాహనను పెంచడంలో దాని పాత్రను నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిల్లలు సహా స్థానిక సమాజం చురుకుగా పాల్గొనడం జరిగింది. భారతదేశ గొప్ప వారసత్వాన్ని జరుపుకునే సాంస్కృతిక ప్రదర్శనలు కూడా కనిపించాయి.

# మాధవరావు కుటుంబానికి సీఎం సహాయనిధి అందజేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** గుండె ఆపరేషన్ కోసం ఇబ్బందులు పడుతున్న బెల్లంకొండ మాధవరావు జలదంకి జమ్మలపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులకు తెలపగా కార్యకర్తలకు కష్టాల్లో అండగా నిలబడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కు తెలిపిన కొన్ని రోజులకే సీఎం రిలీఫ్ ఫండ్ వారికి 1,16000 రూపాయలు చెక్కును మంజూరు చేశారు . నియోజకవర్గంలోని ప్రతి ఒక్క పేద కుటుంబానికి అండగా నిలుస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు.అనంతరంజలదంకి మండలం చోడవరం గ్రామానికి చెందిన నేరెళ్ల వెంకటేశ్వర్లు కుటుంబానికి కూడా 64000అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పులిగుంట మధుమోహన్ రెడ్డి, ఉదయగిరి రైతు అధ్యక్షులు పూనూరు భాస్కర్ రెడ్డి,జయ చంద్రారెడ్డి మండల యువత అధ్యక్షులు మునగాల తిరుమలరెడ్డి, జమ్మలపాలెం చెరువు ప్రెసిడెంట్ జాజుల కోటయ్య, మాజీ గ్రామ కమిటీ సభ్యులు పోలుబోయిన మాలకొండయ్య, సింగమనేని మనోజ్ కుమార్, చోడవరం టిడిపి నాయకులు జాజుల శివరామయ్య, మందపల్లి మదన్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపికాట్వా బలోపేతానికి సమిష్టి కృషి ఆవశ్యకం - కమతం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాపు ఉపాధ్యాయసంఘం (ఏపికాట్వా) బలోపేతానికి జిల్లా వ్యాప్తంగా సమిష్టి కృషి ఆవశ్యకమని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమం, క్యాలెండర్లు, పాకెట్‌డైరీలు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. బి.వి.నగర్‌లోని రావి హనుమంతరావు అపార్ట్‌మెంట్‌లో ద్వితీయ వార్షికోత్సవం కూడా నిర్వ హించామన్నారు. అధ్యక్షుడు శీలం టుంకుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎక్సైజ్ ఆఫీసర్ రావి హనుమంతరావు పాల్గొని క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారన్నారు. ప్రధాన కార్యదర్శి చెరుకూరు హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు దోర్నాల వెంకటరామ్మోహన్, జిల్లా ప్రధానకార్యదర్శి అమిరిశెట్టి హజరత్తయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి కోట అనిల్‌కుమార్‌లు ప్రసంగి స్తూ.. సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని త్వరితగతిన అధిగమించేలా యత్నించాలని కోరారు. సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సంఘ బలోపేతానికి కమతం సుబ్బా రావు చేస్తున్న కృషిని వారు కొనియాడారు. అందరి సహకారంతో సభ్యత్వ నమోదు పూర్తి చేస్తామని టింకుబాబు, హరికృష్ణ, జమ్మల నర్సింహయ్య, పరుచూరి అమరేంద్ర కుమార్‌లు పేర్కొన్నారు. గునుకుల శివయ్య, నలగండ్ల మురళీకృష్ణ, దర్శి వెంకటేశ్వర్లు, సంచుల వెంకటేశ్వర్లు, బండి కొండయ్య, శెట్టిపల్లి రవీంద్రబాబులు ప్రసంగిస్తూ.. కాట్వా పటిష్టత, చేపట్టనున్న కార్యక్రమాలు, బలోపేతం గురించి వివరించారు. భువనేశ్వరం శారద సభ్యత్వం స్వీకరించారు. జిల్లాలో కాట్వా దినదిన ప్రవర్ధమానమవుతుందని, అనేక మంది ఉపాధ్యాయులు యూనియన్‌లో చేరేలా నాయకులు పట్టుదలగా, ప్రత్యేక శ్రద్ధతో కృషిచేస్తున్నారని కమతం సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాట్వా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాస్ పరీక్షకు 693 మంది హాజరు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** నిరక్షరాసులను అక్షరాసులుగా తీర్చిదిద్దడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పొదలకూరు మండలంలో ఆదివారం చేపట్టిన ఉల్లాస్ పరీక్షకు 693 మంది అభ్యాసకులు హాజరయ్యారు. పొదలకూరు మండలంలోని 45 కేంద్రాల్లో నిర్వహించిన ఈ ఉల్లాస్ పరీక్షను పొదలకూరు, బిరదవోలు కేంద్రాలలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ ఆజాద్, సూపర్ వైజర్ మస్తాన్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలల్లో చదువురాని వారిని గుర్తించి వారికి చదువు నేర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఇందులో భాగంగా పొదలకూరు మండలంలో 683 మందికి గత ఏడాది డిసెంబర్ 23 వ తేదీ నుంచి వివోఏ ల ద్వారా చదువు నేర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం చిన్నయ్య, సీసీ సరోజ, వివోఏ పి భాగ్యమ్మ, అంగన్వాడీ వర్కర్ ప్రవీణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పలువురి కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామం తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు చాగంటి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో గుండెదిన శస్త్ర చికిత్స చేయించుకొని వైద్యశాల నుంచి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారి గృహానికి కావలి శాసనసభ్యులు కావ్య వెళ్లి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని తెలిపారు. అలాగే చలంచర్ల గ్రామానికి చెందిన ఏడవ వార్డు మెంబరు నలతోటి సుబ్రహ్మణ్యం తల్లి రోశమ్మ ఇటీవల మృతి చెందారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా పరామర్శించలేక పోయినందువలన కావలి శాసనసభలు కావ్య కృష్ణారెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యుల పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ ప్రజలు ఉన్నారు.

## ప్రభుత్వ సహకారంపై సర్పంచ్ ఆనందం




**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** పంచాయితీలో పారిశుద్ధ్య పనులు, ఇతర అవసరాల నిమిత్తం ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక స్వరంతో సోనాలిక ట్రాక్టర్లను అందించడం పై అనంతసాగరం మండలం పడమటి కమ్మంపాడు సర్పంచ్ కత్తి లావణ్య హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ పారిశుద్ధ్య పను ల నిమిత్తం అద్దెకు ట్రై సైకిళ్లను, ట్రాక్టర్లను వినియోగించడం జరిగిందని ఆమె అన్నారు. అద్దె భారం పంచాయతీలపై పడకుండా అభివృద్ధిలో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సాధించడం ఆనందం కలిగిస్తుందన్నారు. సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పారిశుద్ధ్య గ్రీన్ అంబాసిడర్లకు వాహనాన్ని పంచాయతీ సెక్రెటరీ పుల్లయ్య, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేంద్రలు అందజేశారు.

## వైభవంగా సాయిబాబా సత్సంగ మహోత్సవం

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేట లో తూర్పు వీధిలో ఉన్న సాయిబాబా మందిరంలో ఆదివారం సాయిబాబా సత్సంగ మహోత్సవం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా సాయిబాబా మందిరంలో ప్రత్యేకంగా పూల అలంకరణ చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం అన్న ప్రసాదం వినియోగం నిర్వహించారు. సాయంత్రం 4, గంటల నుండి సాయిబాబా నామ సంకీర్తనలతో భజన కార్యక్రమంతో పాటు గ్రామంలోని నగర ఖాన మీదుగా బస్టాండు సెంటర్ సత్రం సెంటర్ మెయిన్ బజార్ మీదుగా సాయిబాబా మందిరం వరకు సాయిబాబా పల్లకి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి సాయి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజలు,సాయి బాబా భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని సత్సంగ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ బాలాజీ గార్డెన్స్ బ్రోచర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు గ్రామ సమీపంలో కావలి దుత్తలూరు హైవే పక్కన నుడా అనుమతులతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ గార్డెన్స్ బ్రోచర్‌ను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. లేఅవుట్ మేనేజర్ జూపల్లి రాజారావు ఎస్ఎన్ఎల్ డెవలప్మెంట్ డైరెక్టర్ బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని అనుమతులతో కూడిన ఈ లేఔట్ దినదిన అభివృద్ధి చెందాలని, లాభాల బాటలో పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎన్ఎల్ డెవలప్మెంట్ మేనేజర్లు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో చంద్రబాబు పేదలను ఆదుకుంటున్నారు

## ఆపదలో ఉన్నవారికి చేదోడుగా నిలబడడమే లక్ష్యం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతో కష్టాలలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకుఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృతజ్ఞతలు తెలియచేశారు. నెల్లూరు నగరం మాగుంట లే అవుట్‌లోని ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు చెందిన 18 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలలో కోవూరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 7 విడతలలో 103 మందికి 1 కోటి 49 లక్షల 74 వేలు విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారమన్నారు. 8వ విడతగా 18 మందికి 19 లక్షల 95 వేలతో పాటు ఇప్పటి వరకు 8 విడతలలో మొత్తం 1 కోటి 69 లక్షల 70 వేలు సీఎంఆర్ ఎఫ్ చెక్కులు అందజేశారన్నారు. పేదలను ఆదుకుంటున్న సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఇందుకూరు పేట టీడీపీ మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్ర నాయుడు, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, అడపాల అనీష్ రెడ్డి, చేనేత కార్పొరేషన్ డైరక్టర్ తాళస్వామి, టీడీపీ నాయకులు కరకట్ట మల్లికార్జున, వంశీధర్ రెడ్డి, ఫిరోజ్ పాల్గొన్నారు.

# బోడిగాడి తోటలో పర్యటించిన మంత్రి నారాయణ

## సమాధుల తోటలోని ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దండి.. అధికారులను ఆదేశించిన మంత్రి నారాయణ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నగరంలోని 5వ డివిజన్లలో సమాధుల తోటను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం సందర్శించారు. సమాధుల తోట పక్కన ఉన్న ఖాళీ స్థలంలో అన్ని హంగులతో సుందరమైన వాతావరణం పార్కులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పార్కులో 200 మంది కెపాసిటీతో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మంత్రి ఆదేశించారు. ఈ ప్రాంతంలో పేదలే అధికంగా ఉండడాన్ని



దృష్టిలో పెట్టుకుని కమ్యూనిటీ హాల్ అద్దె ఒక్క రూపాయి మాత్రమే తీసుకునేలా చర్య చేపట్టాలన్నారు. వెంటనే పనులు ప్రారంభించి శరవేగంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. మంత్రి నారాయణ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల స్థానిక పేద ప్రజలు బోడిగాడితోట వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ, అదనపు కమిషనర్ నందన్, ఉన్నతాధికారులు, స్థానిక టిడిపి ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# గొప్ప సేవాతత్పరుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



(మొదటి పేజీ తరువాయి)

నేతలకు దివ్యాంగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు చాలా మంది వికలాంగులు తన వద్దకు వచ్చి గ్రామాలకు వాటర్ ప్లాంట్స్ ఇస్తున్నారు కదా, అదేవిధంగా తమకు కూడా ట్రై సైకిళ్లు అందించాలని విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ చెప్పారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చెప్పినట్లు ఎంపీ చెప్పారు. ఇప్పటికే కోవూరులో 250, ఉదయగిరిలో 150, కందుకూరులో 150, ఆత్మకూరులో 150 ట్రై సైకిళ్లు అందించామని, త్వరలోనే మిగిలిన మూడు నియోజక వర్గాల్లో కూడా అందిస్తామని ఎంపీ చెప్పారు. ఆత్మకూరు పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించినట్లు ఎంపీ పేర్కొన్నారు. ట్రై సైకిళ్లు అందుకున్న ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి పలకరించినపుడు ఆనందం మధురానుభూతిగా ఉందని, ఇదే స్ఫూర్తితో ఇలాంటి మంచి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలనే ఆలోచన, సంకల్పం కలుగుతుందని చెప్పారు. దివ్యాంగు లందరూ ఈ ట్రై సైకిల్స్‌ను సద్వినియోగం చేసుకొని ఆత్మస్థైర్యంతో జీవించాలని పిలుపు నిచ్చారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ.. నెల్లూరు పార్ల మెంటు చరిత్రలో సరికొత్త సువర్ణ అధ్యాయానికి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. పండగ వాతావరణంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేయడం ఆత్మకూరు పట్టణంలో అరుదైన విశేషంగా మంత్రి చెప్పారు. ఎంతో మంది పెద్ద పెద్ద వ్యాపారస్తులు ఉన్నప్పటికీ విశాలమైన ఆలోచన దృక్పథం, సేవా స్ఫూర్తి గల వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు ఎంపీగా ఉండడం జిల్లా ప్రజల అదృష్టంగా మంత్రి పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డి ఔదార్యం ముందు దివ్యాంగులు తమ బాధలు కూడా మర్చిపో యారని, ఆనందంగా ట్రై సైకిల్ అందుకొని సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఆత్మకూరులో 150 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్ అందించారని, ఇంకా ఎవరైనా అర్హత ఉండి ట్రై సైకిల్ అందని వారుంటే వారికి కూడా అందించాలని ఎంపీ వారి సిబ్బందికి సూచించినట్లు మంత్రి ఆనం పేర్కొన్నారు. గొప్ప మనసుతో మంచి కార్యక్రమాలకు నాంది పలుకుతున్న ఎంపీ వేమి రెడ్డికి ఆత్మకూరు జిల్లా ప్రజానీకం తరపున మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# దాతలు ముందుకు రావడం అభినందనీయం

## ఆత్మకూరు బస్టాండ్ లో స్టీల్ బెంచీల ఏర్పాటును ప్రారంభించిన మంత్రి నారాయణ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పరిధిలోని ఆత్మకూరు బస్టాండ్‌లో శుభమస్తు ఫౌండేషన్ ఏర్పాటు చేసిన స్టీల్ బెంచీలను రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో మంత్రి నారాయణకు ఘన స్వాగతం లభించింది. ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు భయా శ్రీనివాసులు, భయా రవి తదితరులతో కలిసి స్టీల్ బెంచీలను మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం శుభ పరిణామమన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు ప్రస్తావించడం జరిగిందని గుర్తు చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం తీసుకొచ్చి నెల్లూరు నగరాన్ని దోమల రహిత నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ డ్రైనేజీ సిస్టం కోసం గతంలో రూ.5 వేలు చెల్లించాల్సి వచ్చేదని, ప్రస్తుతం కేవలం ఒక్క రూపాయి చెల్లిస్తే సరిపోతుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. అలాగే మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. 54 డివిజన్లలో పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని, ఇప్పటికే పార్కుల్లో, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్లేఎక్విప్మెంట్ జిమ్ ఎక్విప్మెంట్, ఆట పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు నెల్లూరుకు త్వరలోనే ఎలెక్ట్రిక్ బస్సులు వస్తున్నాయన్నారు. తాను 1979లో వీఆర్ కళాశాలలో చదివానని, అక్కడే లెక్చరర్ గా కేవలం నాలుగు రూపాయల జీతంతో పనిచేశానన్నారు. జాఫర్ సాహెబ్ కాలవ కట్ట, సర్వేపల్లి కాలవ కట్ట తదితర ప్రాంతాల్లో నివసించే నిరుపేదలైన బాలకి చెందిన వారి పిల్లలకు ఉచిత విద్య తోపాటు అల్పాహారం మధ్యాహ్నం భోజనం సాయంత్రం స్నాక్స్ అందించి నాణ్యమైన విద్యనందిస్తామన్నారు. విఆర్‌సీని దేశంలోనే మోడల్ స్కూల్‌గా తీర్చి దిద్దుతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి రెడ్డి వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం పాల్గొన్నారు.

## శుభమస్తు షాపింగ్ మాల్ వారు కుర్చీలు బహుకరణ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నిత్యం వేలాది మంది ప్రయాణికులు వచ్చే ఆత్మకూరు బస్టాండ్లో బస్సులు వచ్చే సమయం వరకు కూర్చోనేందుకు అసౌకర్యంగా ఉన్న కుర్చీలతో ప్రజల ఇబ్బంది పడుతున్నారని వివిధ పత్రికలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం రాష్ట్ర మంత్రి నారాయణ, ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డిలు కొత్తగా బస్టాండ్‌లో కొత్త కుర్చీలను ఏర్పాటు చేయించారు. శుభమస్తు షాపింగ్ మాల్‌వారు కుర్చీలను బహకరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కంది కట్ల రాజేశ్వరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, జిల్లా కార్యా వర్గ సభ్యుడు నరాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీలో ఆరికట్ల



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద రవిచంద్రలు ఆదివారం ఆత్మకూరులో వికలాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మర్రిపాడు మండల టీడీపీ కన్వీనర్ ఆరికట్ల జనార్దన్‌నాయుడు పాల్గొని మండలంలోని వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. మర్రిపాడు మండలంలో వికలాంగులను గుర్తించి ఆత్మకూరుకు తరలించిన ఆరికట్లను మంత్రి ఆనం, ఎంపీ ప్రభాకర్ రెడ్డిలు అభినందించారు. ఆరికట్ల జనార్దన్ నాయుడు వెంట చిలకపాడు మాజీ సర్పంచ్ క్రిష్టిపాటి మధుసూదన్ రెడ్డి, కర్రావుల శ్రీనివాసులు, ఎలగాల వెంకటేశ్వర్లు ఉన్నారు.

# ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా : మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడాని కృషి చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన సేవలందించేందుకు కల్పించాల్సిన మౌళిక సౌకర్యాలు, వైద్య పరికరాల ఏర్పాటు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వైద్యాధికారులు, కమిటీ సభ్యులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధికి అందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే పేదలకు మంచి వైద్యం అందించాలని కోరారు. వైద్యశాలలో పారిశుధ్యం, రోగులకు ఆహారం అందించడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ ఆసుపత్రి ఏర్పాటులో తన పాత్ర ఎంతో ఇమిడి ఉందని , దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు.కొత్తగా 50 బెడ్ల నిర్మాణానికి ఎంత అవుతుందో అంచనాలు రూపొందించాలని ఏపిఎంఐడిసి ఈఈని ఆదేశించారు. వైద్యశాలలో పాత వైద్య పరికరాలు రిపేర్స్ చేయించడమే కాకుండా ఆధునిక వైద్య పరికరాలు కొనుగోలు చేయాలన్నారు. ఆస్పత్రిలో ట్రామా కేర్ యూనిట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి



చెప్పారు. అలాగే ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా ఒక నర్సింగ్ కళాశాలను కూడా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని,దాని ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రిలో ఒక పీడియాట్రిషన్, జనరల్ మెడిసిన్‌కు వైద్యులు లేరని,లిఫ్ట్, ఎక్స్‌రే యూనిట్ కొత్తది ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ శేషారత్నం మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆసుపత్రి అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్ర వివరాలతో నివేదికను అందించాలని, వైద్యారోగ్య శాఖ మంత్రితో మాట్లాడి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న నిధులను వినియోగించి పరికరాల కొనుగోలుకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. పూర్తిస్థాయి నివేదికతో జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని నిధులు ఖర్చు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఆసుపత్రిని ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్గ్రేడ్ చేసి ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ ఆసుపత్రితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్న మంత్రి, విడతలవారీగా 200 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రతిరోజు సుమారు 600 మంది వరకు రోగులు ఆసుపత్రికి వస్తుంటారని, అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ యూనిట్ లో 15 పడకలు ఏర్పాటు చేసి మూడు షిఫ్ట్‌లలో వైద్య సేవలు అందిస్తుండగా, నాలుగో షిఫ్ట్ ను కూడా ఏర్పాటు చేసి డయాలసిస్ రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ డయాలసిస్ యూనిట్ రెండో అంతస్తులో ఉన్నందున కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, త్వరలోనే గ్రౌండ్ ఫ్లోర్లో నూతన డయాలసిస్ బిల్డింగ్ను నిర్మించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. త్వరలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని ఆత్మకూరు పర్యటనకు ఆహ్వానించి జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తొలుత ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన బ్లడ్ బ్యాంకును మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రారంభించారు.

ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రి సమీ పంలో ఆత్మకూరు పోలీస్ వారి సౌజన్యంతో ప్రయా ణికులు, రోగుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, ఆర్డీవో బి.పావని, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శేషారత్నం, ఎపిఎంఎస్ఐడిసి ఈఈ నిర్మల్ కుమార్, తెలుగుదేశం నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, తుమ్మల చంద్రారెడ్డి, పులిమి శైలజా రెడ్డి, దావా పెంచలరావు, కేతా వేణు గోపాల్ రెడ్డి, సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్ రెడ్డి, కిలారి సుబ్రహ్మణ్యం నాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి,పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి అపూర్వ స్వాగతం

- జన జాతరను తలపించిన కోడూరుపాడు.
- 3 వేల మందితో కల్తీ కాలనీ నుంచి గమళ్లపాలెం వరకు భారీ ర్యాలీ
- హ్యాట్రిక్ విజయంతో ప్రజలు మాపై మరింత బాధ్యత పెంచారు
- తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న లక్ష్యంతో సాగుతున్న గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ పరిధిలోని కోడూరుపాడు గ్రామానికి విచ్చేసిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 2000 మంది హాజరై భారీ గజమాలలతో గిరిధర్ రెడ్డిని సన్మానించారు. కల్తీ కాలనీ నుంచి కోడూరుపాడు గమళ్ల పాలెం వరకు తప్పెట్లు, బ్యాండ్ మేళం, కీలు గుర్రాలతో వేలాదిమంది వెంట రాగా ర్యాలీ హోరెత్తింది. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తే స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందని అందుకనే గడపగడపకు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నెల్లూరు రూరల్ ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకం ఎనలేనిదని, వారి ఆశీర్వాదంతోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం సాధించామన్నారు. నెల్లూరు రూరల్ ప్రజలు తమపై చూపుతున్న ఆప్యాయత ఎనలేనిదన్నారు. వారి సమస్యల పరిష్కారంతో పాటు, నెల్లూరు రూరల్ ను రాష్ట్రంలోనే అభివృద్ధి పదంలో నడిపేందుకు నిరంతరం కష్టపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు కుడుముల చిరంజీవి, జావిద్, శీను, జయ రామిరెడ్డి, ఒకటవ డివిజన్ కార్పొరేటర్ జానా నాగరాజు 2 డివిజన్ కార్పొరేటర్ రామ్మోహన్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఆటపాటలతో కూడిన చదువు

# మానసిక వికాసానికి తోడ్పాటు

### మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఆటపాటలతో కూడిన చదువు విద్యార్థి మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం మంత్రి నారాయణ నగరంలోని మూలపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, వేద సంస్కృతి పాఠశాల, ఈ ఎస్ ఆర్ ఎం పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆటపాటలతో కూడిన చదువును అందించేందుకు తద్వారా విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా పార్కుల అభివృద్ధి, మున్సిపల్ పాఠశాలల్లో జిమ్ ఎక్విప్మెంట్, ఆట వస్తువులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలోని ప్రతి మున్సిపల్ పాఠశాల, పార్కులలో అధునాతన వసతులను కల్పించే లక్ష్యంతో సందర్శిస్తున్నామన్నారు. గత రెండు రోజులుగా నగరంలోని దాదాపు 40 పాఠశాలలను అలాగే 40 పార్కులను పరిశీలించామన్నారు. కొన్ని ఉన్నత పాఠశాలల్లో విశాలమైన ఆట స్థలాలు అందుబాటులో ఉన్నట్లుగా గమనించామని, అందులో పిల్లలకు అవసరమైన జిమ్ ఎక్విప్మెంట్, షటిల్ కోర్ట్, వాలీ బాల్ కోర్టు తదితర అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులను ఆదేశించామన్నారు. పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రతినెల మూడవ శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆ రోజున ముఖ్యమంత్రి సైతం జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారన్నారు. పర్యటనలో మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, ఇతర అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు "కంచి" ఇఫ్తార్ విందు

**ఆత్మకూరు, మేజర్ న్యూస్:** శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిత్యాన్నదాత, కంచి పరమేశ్వర రెడ్డి ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాలెంలో రంజాన్ మాసంలో ఒక్కపొద్దు పాటిస్తున్నటువంటి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును అందజేశారు. గత రెండు వారాల నుంచి టేక్కే, జలీల్, మదీనా జామియా, మక్కాహ్ మస్జిద్, పెద్ద మస్జిద్ సందర్శించి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును అందజేశారు. అదేవిధం గా ఆదివారం నెల్లూరు పాలెంలోని (మస్జీద్ ఏ నూర్), టిట్కో మస్జీద్‌ను సందర్శించి ఆ ప్రాంత ముస్లిం సోదరులను ఆప్యాయంగా పలకరించి అక్కు న చేర్చుకుని ఇఫ్తార్ విందును అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు పాలెంలోని మస్జిద్ ఏ నూర్ ముస్లిం పెద్దలు ఆ ఏరియా ముస్లిం యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మా మసీద్ అభివృద్ధికి సహాయం అందించిన కంచి పరమేశ్వర రెడ్డి చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలను కొనియాడి ఆయనను పూలమాల శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎందరికో ఆదర్శంగా నిలుస్తూ పేద ప్రజల జీవితాల్లో వెలుగును నింపుతున్న మీలాంటి గొప్ప వ్యక్తి.. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆ అల్లా కృప, కరుణ ఆయనకు ఉండేలా చూడాలని ఆ అల్లాను ప్రార్థించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



# చలివేంద్రను ప్రారంభించిన మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాల ఎదుట పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రను రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. వేసవి తీవ్రత దృష్ట్యా హాస్పిటల్‌కు వచ్చే రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం స్థానిక డిఎస్పి కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రను ఏర్పాటు చేశారు. చలివేంద్రను ప్రారంభించిన మంత్రి రామనారాయణరెడ్డి పోలీస్ అధికారులను అభినందించారు. ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చబూనడం సంతోషదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక సిఐ జి.గంగాధర్, ఎస్ఐలు ఎస్కె జిలాని, ఎస్.సాయిప్రసాద్, కాసా శ్రీనివాసులురెడ్డి,శ్రీ సాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి, తెలుగుదేశం నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, పుట్టం బ్రహ్మానందరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, తుమ్మల చంద్రారెడ్డి, కేతా వేణుగోపాల్‌రెడ్డి, కిలారి సుబ్రహ్మణ్యంనాయుడు, సుంకరపెంచలచౌదరి, కేతా విజయభాస్కరరెడ్డి, పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టరేట్ పొందినవారికి అభినందనసన్మానాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పలు అంశాల్లో పరిశోధనలు గావించి డాక్టరేట్‌లు పొందిన వారిని ఆదివారం ఆత్మకూరులోని గ్రంథాలయ ఆవరణంలో తెలుగుభారతిసేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఆత్మకూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి దివంగత దోర్నాదుల సుబ్బమ్మ రచనలపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన ముగ్గురికి సన్మానాలు చేశారు. దోర్నాదుల సుబ్బమ్మ కుమారుడు రవీంద్రకుమార్‌రెడ్డి సహకారంతో ఈకార్యక్రమం నిర్వహించారు. మహిళాభ్యుదయంపై పరిశోధనచేసిన డాక్టర్ కోసూరు కొండయ్య, ఒకశతాబ్దపురాయలసీమ-స్త్రీ అనే అంశంపై పరిశోధనగావించిన డాక్టర్ వేలూరు భారతి, మధురై కామరాజ్ యూనివర్శిటిలో తెలుగువిభాగాధిపతి డాక్టర్ జె.వెంకటరమణలను తెలుగుభారతి సేవాసమితి ప్రతినిధులు శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అతిథిగా హాజరైన శ్రీ సాంబశివచారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ దోర్నాదుల సుబ్బమ్మ రచయితగా, మహిళామండలి అధ్యక్షురాలుగా మహిళాభ్యుదయానికి చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ఈకార్యక్రమంలో దోర్నాదుల కుమారుడు రవీంద్రకుమార్‌రెడ్డి, కోడలు జయప్రద, తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, సమితి ప్రతినిధులు సోమవరపు యానాదిరెడ్డి, కె.వి.శేషారెడ్డి, ఎస్.వి.రమణయ్య, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, అచ్చోలు నారశింహారెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, ఏ.గోవిందరెడ్డి, కొల్లా వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రెడ్డి, టిసివి సుబ్బయ్య, కలిశెట్టి రవీంద్రకుమార్, ఓంకారం శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**వింజమూరు మేజర్‌న్యూస్ :** వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ, కార్పొరేట్ వైద్యశాలలలోవైద్యం అందించుకొని, తమ సొంత నగదును ఖర్చు చేసుకున్న సుమారు 78 మంది బాధితులకు సుమారు కోటి రూపాయలు సీఎం సహాయ నిధి చెక్కులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందజేశారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేత మంజూరు చేయించి, బాధితులకు అండగా నిలిచారు ఆదివారం వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో ఆదివారం పండుగ వాతావరణం లో 8 మండలాల టిడిపి మండల కన్వీనర్ లు, ముఖ్య నాయకులు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు గ్రామ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యేకాకర్ల సురేష్, ఆయన సతీమణి కాకర్ల ప్రవీణ ఆధ్వర్యంలో బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకొని ఆనందం వ్యక్తం చేస్తూ, గతంలో మునుపెన్నడు లేని విధంగా పార్టీలకు అతీతంగా, మాకు అండగా నిలిచారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా అందని వైద్యానికి సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఉదయగిరి నియోజకవర్గం ప్రజల తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి యువ నాయకుడు మంత్రి నారా లోకేష్‌కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి వైద్య సేవలు అందించామని, చాలామంది బాధితులను దగ్గరగా చూశానని, అనుకోకుండా వచ్చే జబ్బులతో కుటుంబాలు చిన్న భిన్న అవుతున్నాయని వారందరిని ఆదుకునేందుకు నేనెప్పుడూ ముందు ఉంటాను అని తెలిపారు. అదేవిధంగా టిడిపి సభ్యత్వం కుటుంబానికి అండగా నిలుస్తుంది అన్నారు. రాష్ట్ర ప్రజల పేదరికం నిర్మూలనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వచ్చే నాలుగు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొస్తుంది అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టే వెంకటేశ్వర్లు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కదిరి రంగారావు, మండల కన్వీనర్లు గొంగటి రఘునాథరెడ్డి, పేలపూడి వెంకటరత్నం, సిహెచ్ బయన్న, చంద్రా మధుసూదన్ రావు, కప్ప ప్రభాకర్ రాజు, బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, మధు మోహన్ రెడ్డి, జిల్లా కార్యనిర్వక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ముఖ్య నాయకులు కూటమినేతల తదితరులు ఉన్నారు.




## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**కావలి మేజర్ న్యూస్:** కావలి పట్టణ పరిధిలోని బుడంగుంటలో ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఏడవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం బుడం గుంటలో జరిగింది. చౌదరిపాలెంకు చెందిన 1990- 91 బ్యాచ్ పూర్వ విద్యార్థి కోడెల కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వచ్చిన అప్పటి ఉపాధ్యాయులు కావలి దేవదానం జి.దయాకర్‌ను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడు తూ, 35 సంవత్సరాల క్రితం ఎంతో ప్రయాసలతో చుట్టుపక్క ప్రాంతాల నుండి పాఠశాలకు నడిచి వచ్చేవారన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మా ఈ పాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామన్నారు. ప్రస్తుత విద్యార్థులు యూనిఫాం స్టిచ్చింగ్‌ల కోసం రూ.8వేల నగదును పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్ జె.వి. రామారావుకు అందజేసి వారిని కూడా సన్మానించి, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, పాఠశాల ప్రాంగణంలో కలిసి తిరిగారు.



## పురపాలక ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించండి

**కావలి మేజన్‌న్యూస్:** కావలి పురపాలక ఉపాధ్యాయులు ఆదివారం నెల్లూరులో పురపాలక శాఖ మంత్రి నారాయణ కలిసి పురపాలక అంతర్జిల్లా ఒకే జిల్లాలో పురపాలక పాఠ శాలల నుండి నగరపాలక పాఠశాలలకు బదిలీలు చేసే అవకాశం కల్పించాలని, మంత్రి నారాయణకు వినతి పత్రాన్ని అందించారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 84 అమలు కాక రద్దు చేయబడక అనేక విధాలుగా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు అనంతరం మంత్రి నారాయణ స్పందిస్తూ, ఇప్పటికే పలుసార్లు అందిన వినతుల పైన మానవవనరుల శాఖ మంత్రి లోకేష్‌తో మాట్లాడానని, అన్ని యూనియన్లతో మంత్రి ఈ విషయంపై చర్చించారని మంత్రితో మాట్లాడి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పురపాలక ఉపాధ్యాయులు టీ. కొండారెడ్డి కే.వీ. కిరణ్ కుమార్, వై. శ్రీనివాసులు బి. సరళ, బి. సుజాత డి. శిరీష, అరుణ పాల్గొన్నారు.



## పార్కు స్థలాన్ని కబ్జా దారుల నుండి కాపాడండి

**నెల్లూరు సిటీ మేజర్‌న్యూస్:** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ బిట్-3లో 1989 లో ఎన్టీఆర్‌నగర్ ఏర్పడినప్పుడు స్థానికంగా పార్కు ఏర్పాటు చేసుకునే దాని కోసం కొంత స్థలాన్ని కేటాయించడం జరిగిందని, జనతా వాకర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు వినతి పత్రం సమర్పించారు. అలాగే జనతా వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముక్కు రాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్లో దేవాలయం, మసీదు, చర్చిలకు ఆనాడే స్థలాలు కేటాయించారని అవన్నీ కట్టుకొని ప్రజలు ప్రార్థనలు నిర్వహించుకుంటున్నారని, ఆనాడు పార్కు కోసం కేటాయించిన స్థలం ఇప్పటికీ అలాగే ఉండిపోయిందని దానిని కొంతమంది సొంత అవసరాలకు వాడుకుంటూ కబ్జా చేస్తున్నారని కార్పొరేషన్ వారు ఇప్పటికైనా స్పందించి ఆ స్థలాన్ని పార్కుకు ఉపయోగించాలని అనేకమార్లు స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులను, జిల్లా అధికారులను, నుడా చైర్మన్‌ను కలసి వినతి పత్రాలను ఇవ్వడం జరిగింది. కానీ అప్పటినుండి ఇప్పటి వరకు సమస్య పరిష్కరించబడలేదని అందువలన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు జనతా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఈ సమస్య ను ఆయన దృష్టికి తీసుకు వెళ్లడంతో తక్షణమే సందర్శించి పై పార్కు స్థలంను కబ్జాలకు గురికాకుండా పార్కు నిర్మాణమునకు త్వరితగతిన ఏర్పాట్లు చేయవలసిందిగా అధికారులకు తగు సూచనలు చేయడం జరిగింది. పార్కులలో ఆకస్మిక పర్యటనలు చేస్తూ పార్కుల అభివృద్ధి కోసం పాటుపడడం పట్ల జనతా వాకర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆయనకు అభినందనలు తెలియజేస్తుందని అన్నారు. పై కార్యక్రమంలో జనతా వాకర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కాయాల మధు, పోలిచెర్ల ఉదయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పైడి చరణ్ తేజ , తణుకు ముని బాబు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవానికి తరలిరండి

## - పిలుపునిచ్చిన తటవర్తి రమేష్

**కావలి మేజర్‌న్యూస్:** మార్చ్ 24వ తేదీన కావలి పట్టణానికి పెనుగొండ క్షేత్ర పిఠాధిపతి బాల స్వామీజీ వస్తున్నట్లు కావలి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షు లు తట్టువర్తి రమేష్ తెలిపారు ఈ సందర్భంగా ఆదివా రం ఎస్బిఐ బ్యాంక్ వద్ద ఉన్న కళ్యాణ మండపములు ఆర్యవైశ్యులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు అనంతరం రమేష్ మాట్లాడుతూ, బాల స్వామీజీ ముం దుగా శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానానికి వస్తున్నట్లు తెలిపారు ఆయనకి ఆర్యవైశ్య నేతలు అందరూ ఘన స్వాగతం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు బృందావన కాలనీ కళ్యాణ్ మండపం లో శ్రీ శ్రీనివాస కళ్యాణం జరుగుతుందని తెలిపారు. బాల స్వామీజీ సమక్షంలో ఈ కళ్యాణం వేడు కలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే తీర్థప్రసాదాలు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య సెక్రటరీ రామకృష్ణ మాట్లాడుతూ, రమేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం కి ఆర్యవైశ్యులు కుటుంబం సమేతంగా తరలి రావాలని స్వామివారి కృపకు పాత్రులు కావాలని, ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా జరిగించేందుకు సహకరించాలని కోరారు.



# భగత్ సింగ్ ఆశయాలు కొనసాగించండి

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్ న్యూస్:** విప్లవ జ్యోతి స్వతంత్ర సమరయోధుడు భగత్ సింగ్, సుఖదేవ్ ,రాజ్ గురు ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ పిలిపునిచ్చారు. ఆదివారం మండలంలోని దామరమడుగు గ్రామం లో భగత్ సింగ్ 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవ వీరులను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు వెళ్లాలని అన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యో నానాటికి పెరిగిపోయి యువతలో నిరాశ నిస్పృహలు అలుముకుంటున్నాయని అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉద్యోగ కల్పన చేయకుండా మనువాద సిద్ధాంతాలు ముందుకు తీసుకుని వెళుతుందని అన్నారు. ఈ ప్రయత్నం ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. చరిత్రను మారుస్తూ ప్రజల్లో అలజడులు సృష్టి స్తున్నారని అన్నారు. ఎన్నో వందల ఏళ్ల క్రితం జరిపిన సంఘటనలు మరల మరల తిరగదొడుతూ ప్రజలను భావోద్వేగాల్ని రెచ్చగొడుతూ తన పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. దేశంలో ఒకరిద్దరు పెట్టుబడిదారులు ప్రోత్సహిస్తూ దేశ సంపదను వారికి దోచిపెడుతున్నారని అన్నారు. యువత సంఘటితమై కేంద్ర ప్రభుత్వం విధానాలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గండవరపు ఓంకార్, గుండాల సతీష్, వంజీవాక కృష్ణ ప్రసాద్, గరికిపాటి సురేష్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.





# ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**వింజమూరు మేజర్ న్యూస్ :** వింజమూరు పట్టణంలోని ప్రసన్న రెడ్డి నగర్ లో వేంచేసి యున్న శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆలయ కమిటీ సారథ్యంలో శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి గుంటూరు పెదకాకాని వారిచే నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ప్రారంభించారు. ముందుగా హరిహర పుత్ర అయ్యప్ప స్వామికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించి, కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గణపం సర్పంచి ఎన్. సుజన. తెలుగుదేశం పార్టీమండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి. మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు. సీనియర్ నాయకులు గూడ నరసా రెడ్డి. వనిపెంట వెంకటసుబ్బారెడ్డి గురజాల వాసు.ఆలయ కమిటీ చైర్మన్ కరకల మాల కొండారెడ్డి. చేబ్రోలు వసంత కుమార్. వెలుగోడు కృష్ణ, కమిటీ సభ్యులు నాయకులు తదితరులు ఉన్నారు.

# సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ 2025-26 బడ్జెట్ పై వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, నగరంలోని ప్రముఖులతో సిపిఎం నెల్లూరు నగర్ కమిటీ ఆధ్వర్యంలో టౌన్ హాల్ రీడింగ్ రూమ్ లో ఆదివారం ఉదయం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు మాట్లాడుతూ, నెల్లూరు నగరపాలక సంస్థ 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలు చూస్తే రాబోయే సంవత్సరంలో నెల్లూరు నగర ప్రజల ముక్కు పిండి 222 కోట్ల రూపాయల పన్నులు వసూలు చేసేందుకు అంచనాలు సిద్ధం చేసి ఉన్నారని అన్నారు. గడచిన సంవత్సరంలోనే 3 కోట్ల 41 లక్షల రూపాయలు ఉన్న కొళాయి పన్నులను 6 కోట్లు, 58 కోట్లు ఉన్న ఇంటి పన్నులను 65 కోట్లకు పైగా ముక్కు పిండి వసూలు చేశారని, రాబోయే సంవత్సరంలో 100 కోట్లు ఇంటి పన్నులు వసూలు చేసేందుకు సిద్ధం చేశారని అన్నారు.48 కోట్ల ఉన్న యూజర్ చార్జీలను 90 కోట్ల రూపాయల దాకా పెంచుతున్నారన్నారు. ప్రభుత్వం నుండి రావలసిన నామమాత్రపు గ్రాంట్లు కూడా పాలకులు రాబట్టలేదని అన్నారు. మున్సిపల్ శాఖ మాత్యులు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నప్పటికీ గ్రాంట్లు రాబట్టలేకపోవడం విచిత్రంగా ఉందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి అనేక రకాల గ్రాంట్లు వచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ పాలకులు వాటి మీద దృష్టి పెట్టకుండా ప్రజలపై భారీగా పన్నులు మోపడం పైనే దృష్టి పెట్టడం పాలకుల చేతగానితనం తెలియజేస్తున్నదన్నారు. జలజీవన్ మిషన్ పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా నీరు అందిస్తామని చెపుతుంటే నెల్లూరు నగరంలో వేల రూపాయలు కొళాయి పన్నులు విధిస్తున్నారన్నారు. కనీసం ఎమ్మెల్యే గ్రాంట్లు కూడా రాబట్ట లేకపోవడం విచిత్రంగా ఉన్నదన్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాబట్టాల్సిన గ్రాంట్లు రాబట్టకుండా నగర ప్రజలు కట్టిన పన్నులలోని సాధారణ నిధుల నుండి పనులు



చేస్తూ గొప్ప అభివృద్ధి సాధించామని ప్రచారాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన ప్రజా ప్రతినిధులు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేయాలి తప్ప, ప్రజల నెత్తిన గుదిబండలా భారాలు మోపి ఇబ్బందులకు గురి చేయకూడదని అన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కొన్ని తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ తదతరులు, కాంగ్రెస్ పార్టీ నుండి నగర నాయకులు సంజయ్, సుధీర్, సమాచార హక్కు చట్టం నాయకులు శ్రీనివాసులు, ఆదివాసి హక్కుల సంఘం నాయకులు బాబు, వ్యాపారస్తుల సంఘం నాయకులు మాల్యాద్రి, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నెల్లూరు నగర కార్యదర్శి బీపీ నరసింహ, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.



# ఉగాది ఉత్సవాల కరపత్రాలు విడుదల చేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** నెల్లూరు నగరంలోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 30న జరగబోవు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది మహోత్సవ కరపత్రాలను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ.. ఉగాది ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, దేవస్థాన ఫెస్టివల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 25న జాబ్‌మేళా

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లోనెల 25న ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా కార్యక్రమం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈజాబ్ మేళాలో వైఎస్సార్ ఇన్ఫోటెక్, ఆల్ ట్రస్ట్ టెక్నాలజీ ఇండియా ప్రైయివేట్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పదవతరగతినుండి డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, బిటెక్ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాల్గొనే యువత ఆధార్ కార్డు జెరాక్స్, బయోడేటా, రెజ్యూంతో హాజరు కావాలన్నారు.

## ఉల్లాస్ పై అసెస్మెంట్ పరీక్ష... పరిశీలించిన ఏపీఎం సతీష్



**అనుమసముద్రంపేట మేజర్‌న్యూస్:** ఏఎస్ పేట మండలంలోని అంగనవాడి కేంద్రాలలో ఉల్లాస్‌పై ఆదివారం అసెస్మెంట్ పరీక్షలను నిర్వహించారు ఈ సందర్భంగా మండలంలోని పలు కేంద్రాలను ఏపిఎం సతీష్ పరిశీలించారు మండలంలో మొత్తం 36 కేంద్రాలలో 363 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు గత 45 రోజుల నుండి సెంటర్లలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు ఈ మేరకు వారికి ఆదివారం పరీక్ష నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు వివో ఏలు పాల్గొన్నారు

# వెంకటాచలం వద్ద రోడ్డు ప్రమాదం

## - బైకుదారుడి దుర్మరణం



**వెంకటాచలం, మేజర్ న్యూస్:** నెల్లూరు వెంకటాచలం మండలం గొలగమూడి రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమా దం చోటు చేసుకుంది. నెల్లూరు నుంచి గూ డూరు వెళ్తున్న కారు, ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకు పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందు కున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.



# టీడీపీ, వైసీపీ దొందూ దొందే !

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసి రెడ్డి




ఉదయగిరి, మేజర్‌న్యూస్ :

రాష్ట్రానికి టీడీపీ, వైసీపీలు రాహు, కేతువులుగా దాపురించాయని, పాలనలో ఆ రెండు పార్టీలు దొందూ దొందేనని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. సంపద సృష్టించి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా, 80 శాతం పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. మం దలానికి నాలుగు మద్యం షాపులుంటే 40 బెల్టుషాపులు ఉన్నాయన్నారు. తల్లికి వందనం ఏమోగాని తండ్రికి ఇంధనం మాత్రం 24 గంటలు అందుబాటులో ఉందన్నారు. జగన్ అరచేతిలో వైకుంఠం చూపితే చంద్రబాబు కైలాసం చూపుతున్నారన్నారు. వైసీపీ పాలనలో పెనం మీద ఉన్న అట్లు టీడీపీ పాలనలో పొయ్యిలో పడిందన్నారు. ఇద్దారు రాష్ట్రాన్ని అప్పులో ఊబిలోకి నెట్టారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.9.50 లక్షల కోట్లు అప్పు ఉందన్నారు. కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డ నాకిందన్న చందంగా టీడీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.98,576 కోట్లు అప్పు చేయగా, వచ్చే ఏడాది రూ.1,04,380 కోట్లు అప్పు చేసేందుకు బడ్జెట్లో చూపించడం సిగ్గుచేటన్నారు. విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో రూ.15.425 కోట్లు, 25 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. అనుభవజ్ఞుడని రాష్ట్ర ప్రజలు ఓట్లేస్తే సర్వనాశనం చేస్తున్నాడన్నారు. రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి సోము అనిల్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలయ్య, రాజగోపాల్ రెడ్డి, జగదీష్ బాబు రావు హజరత్తయ్య ఆశోక్ కుమా ర్రెడ్డి, అన్వర్ ఆమర్, ఉత్తన్న, రాజు, రమణ పాల్గొన్నారు.

# నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగాలి

- బుచ్చిలో వైసీపీ క్లోజ్ వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పలువురు నేతలు
- అవినీతి పాలన నుంచి విముక్తి పొంది తొమ్మిది నెలలైంది
- అభివృద్ధి, సంక్షేమమే తెలుగుదేశం అజెండా
- పాత కొత్త నాయకుల మధ్య సమన్వయం అవసరం
- బుచ్చి పట్టణంలో టిడిపిలో చేరికల సందర్భంగా వేమిరెడ్డి దంపతులు



బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని మొమలా ఫంక్షన్ హాల్ లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిల సమక్షంలో వైసీపీ నుంచి పలువురు నాయకులు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంపీ వేమిరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో వైసీపీ టౌన్ కన్వీనర్ టంగుటూరు మల్లారెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ యరటపల్లి శివకుమార్ రెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ బెలూం మల్లారెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ కోటంరెడ్డి లలితా రెడ్డి, వైసీపీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ దస్తగిరి, బుచ్చి టౌన్ నాయకులు కోటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, చెన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కంటా నరసింహులు, వారి అనుచరగణం, ఇతర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్నారు. కూటమి పాలన చూసి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నవారికి అభినందనలు తెలియజేశారు. ఓట్లేసిన ప్రజల కోసం, వాళ్ల ప్రాంతాలను అభివృద్ధి చేసుకునేందుకు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. టీడీపీలోకి చేరిన ప్రతీ ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీలో చేరిన వారు.. పాత నాయకులు, కొత్త నాయకులు కలిసి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు కూటమి పాలనలో అభివృద్ధి చూసి ఓర్వలేక విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. గతంలో కోవూరు నియోజకవర్గంలో జరిగిన అవినీతి, అక్రమాల గురించి కోవూరు ప్రజలకు బాగా తెలుసన్నారు. వివక్షకు తావు లేని విధంగా సాగుతున్న చంద్రబాబు గారి పాలనలో అన్యాయాలు లేవని, అక్రమ కేసుల భయం అంతకన్నా లేదన్నారు. వైసిపి హయాంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను కీలుబొమ్మలుగా మార్చేశారన్నారు. వేదికపై వున్న బుచ్చి మున్సిపల్ వైస్‌చైర్పర్సన్ మోర్ల సుప్రజను చూపిస్తూ గత ప్రభుత్వ హయాంలో వైస్ చైర్ పర్సన్ హోదాలో ఏనాడు తాను సీట్లో కూర్చోలేని పరిస్థితి వుండేదన్నారు. తన ఎన్నికల నాటి నినాదమైన అవినీతి రహిత కోవూరు వివాద రహిత కోవూరుకు కట్టుబడి ఉన్నానన్నారు. కోవూరు నియోజకవర్గంలో అవినీతికి తావు లేని పాలన సాగుతుందని అవినీతి అంటూ వుంటే అది ఓ వర్గం పత్రికల సృష్టేనన్నారు. తాము చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలు చూసి ఓర్వలేక తనపై తమ పార్టీ నాయకులపై అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని వైసిపి నాయకులపై నిప్పులు చెరిగారు. పాత కొత్త నాయకులు సమన్వయంతో పని చేయాలని టిడిపి నాయకులకు హితోపదేశం చేశారు. ప్రభుత్వం వారానికోసారి గ్రీవెన్స్ నిర్వహిస్తే తాను రాజకీయాలలో వచ్చినప్పటి నుంచి తన యింటి వద్ద ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది వరకు ప్రతి రోజు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలతో నిత్యం గ్రీవెన్స్ లాంటి ఉంటుందన్నారు. కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి అర్బన్, రూరల్ మండల అధ్యక్షులు బత్తుల హరికృష్ణ, ఎంవి శేషయ్య, టిడిపి సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ఏటూరి శివరామక్రిష్ణా రెడ్డి, విజయరామానాయుడు, చేనేత కార్పొరేషన్ డైరక్టర్ తాళ్ల స్వామి, కోడూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణా రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డితో పాటు బుచ్చి పట్టణ కౌన్సిలర్లు రాచూరి సత్యం, కత్తి నాగరాజు, కళ్యాణ్, వైష్ణవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకానికి

## స్వస్తి పలకండి : కమిషనర్ సూర్యతేజ



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నెల్లూరు నగరపాలక సంస్థలో అమలు చేస్తున్న సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధానాలతో ప్రజల్లో మంచి చైతన్యం కల్పించామని, పౌరులంతా బాధ్యతగా భావించి జనప నార,కాగితం,గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలని కమిషనర్ సూర్యతేజ తెలియజేశారు. సింగల్‌యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక తనిఖీలను ఆదివారం నిర్వహించా రు.స్థానిక స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలోని వివిధ దుకాణాలను తనిఖీ చేసి నిషేధిత ఉత్పత్తులు ఉన్న ఒక దుకాణం నిర్వాహకునికి రూ.1000 జరిమానా విధించారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను ఫంక్షన్లు, వివాహ వేడుకలు, శుభకార్యాలలో కేటరింగ్ నిర్వాహకులు వినియోగించరాదని, ఆదేశాలను అతిక్రమించిన వారిపై భారీ జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో నగరపాలక అదనపు కమిషనర్ నందన్, హెల్త్ఆఫీసర్ డా.చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



ఉదయగిరి, మేజర్‌న్యూస్ : తాగునీటి కోసం జన సంచారంలోకి వచ్చిన ఓ చుక్కల దుప్పిని కుక్కలు వెంటాడి దాడి చేయడంతో దుప్పి మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం మండలంలోని మాసాయిపేట గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుండి గ్రామంలోకి చుక్కల దుప్పి వచ్చింది. కుక్కలు గమనించి దానిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచాయి. స్థానికులు గమనించి దుప్పిని కుక్కల బారి నుంచి కాపాడి అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా దుప్పి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం ఉదయగిరి పశువైద్యశాలకు తరలించి పోస్ట్‌మార్టం అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలతో అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

### ఘనంగా 'స్ప్రెడ్ న్యూస్' సంపాదకులు

## రమేష్ రెడ్డి అంత్యక్రియలు

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :



ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఆపేజు) ఫౌండర్ మెంబర్, రాష్ట్ర నాయకులు, స్ప్రెడ్‌న్యూస్ సంపాదకులు పామూరు జయరమేష్ రెడ్డి అనారోగ్య కారణాల వల్ల శనివారం నారాయణ హాస్పిటల్ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ యూనియన్ నాయకులు, సభ్యులు ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలోని సుజాతమ్మ కాలనీ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి ఆయన అంత్యక్రియలలో పాల్గొన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆపేజు రాష్ట్ర కో- కన్వీనర్ ఉడత రామకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు గట్టుపల్లి శివకుమార్, వెలసిరి కుమార్‌లు మాట్లాడుతూ.. అందరితో కలసి మెలసి సంతోషంగా నవ్వుతూ.. నవ్వించేవారని కొనియాడారు. మాతో 2014 సంవత్సరం నుండి నేటి వరకు ఎడిటర్ రమేష్ రెడ్డి మా యూనియన్ అభివృద్ధి కోసం ఎంతో కీలపాత్ర పోషించారని వివరించారు. ఆయన మరణం మాకు తీరని లోటు అని బాధను వ్యక్తం చేశారు. అంత్యక్రియలలో యూనియన్ రాష్ట్ర నేతలు ఉడత శరత్ యాదవ్ పాల్గొన్నారు.